# "అనుబంధం, ఆత్మీయత...."

చాలాకాలం తర్వాత మళ్ళీ సారథి ఉత్తరం రాశాడు!

ముఖ్యమైన విశేషాలుంటే తప్ప సాధారణంగా సారథి ఉత్తరాలు రాయడు. వాడు జంషెడ్‌పూర్ వెళ్ళిన తర్వాత - ఈ ఏడేళ్ళలోనూ నాకు ఉత్తరాలు రాసిన సందర్భాలు వేళ్ళమీద లెఖ్ఖపెట్టుచ్చు....

ఉద్యోగంలో చేరటానికి ఆఊరు వెళ్ళినప్పుడు క్షేమంగా చేరినట్టు రాశాడు.

విశాఖపట్నంనించి వాడి భార్యను కాపురానికి తీసుకెళ్ళినప్పుడు మరోసారి రాశాడు....

విశాఖ వరకూ వచ్చినవాడు-అప్పుడు నిడదవోలు కూడా వస్తాడేమోనని రాజ్యంతోబాటు నేనూ ఎదురుచూశాను. కానీ శలవు దొరకలేదట!.... అందుకే రాలేకపోయానంటూ క్షమార్పణలు కోరుకున్నాడు ఆ ఉత్తరంలో!

కంపెనీవాళ్ళు క్వార్టర్స్ ఇచ్చినప్పుడు ఇంకోసారి రాశాడు ఉత్తరం. ఆ క్వార్టర్ ఎంతో సౌకర్యంగా వుందనీ, ముందు విశాలమైన గార్డెన్ ఉందనీ - సాయంత్రంపూట తోటపనితో బాగా కాలక్షేపం అవుతోందనీ రాశాడు.

ఆ తర్వాత వాడి బార్యను మొదటిసారి పురిటికి పంపేటప్పుడు కూడా మరోసారి ఉత్తరం రాశాడు....

వాడికి - కొడుకు పుట్టినప్పుడు బారసాల చేసుకునేందుకు అత్తవారింటికి వచ్చేడు... ఆ సందర్భంలోనే మేంకూడా విశాఖపట్నం వెళ్ళాం... రెండేళ్ళ తర్వాత మళ్ళీ సారథిని చూడటం అప్పుడే!

"మీ ఆరోగ్యం ఎలా ఉంటోంది?" - అని అడిగేడు సారథి అప్పుడు.

"ఈ మధ్య అస్తమానం తలనొప్పి వస్తూంటే మొన్నీమధ్య డాక్టరుకి చూపించుకున్నారు... 'బీపీ' వుందని మందులేవో రాసిచ్చారాయన!"- రాజ్యం చెప్పింది వాడికి.

"జంషెడ్‌పూర్ వచ్చేయండి! అక్కడ డాక్టర్‌కి చూపించి

వైద్యం చేయిస్తాను!'' అని అంటాడనుకుని క్షణంలోసగంసేపు వాడి వైపు ఆశగా చూశాను....

కానీ వాడేం మాట్లాడకుండా నిర్లిప్తంగా ఊరుకున్నాడు.

అసలు చిన్నతనం నించీ వాడి తత్వమే అంత! నాతో ఎక్కువ మాట్లాడటం అలవాటులేదు.... ఏం కావాల్సినా వాళ్ళ అమ్మనే అడిగే వాడు. రాజ్యానికి కూడా వాడంటే చాలా గారం!.... నాకు తెలియకుండా చిన్నతనంలో వాణ్ణి సినిమాలకు పంపిన సందర్భాలూ - హోటల్లో చిరు తిళ్లు తినటానికి డబ్బులిచ్చిన సంఘటనలూ ఎన్నోవున్నాయి...

మొదటి సంతానంమీద ప్రతి తల్లికీ ఆ ఆపేక్ష అనురాగాలు వుంటాయేమోమరి!

బారసాల చేసుకుని మూడోరోజున, సారధి తిరిగి వెళ్ళిపోతూంటే గుమ్మంవరకూ వెళ్ళి - వాడు రిక్షాఎక్కుతూంటే అంది రాజ్యం-

"నువ్ వుత్తరాలు రాయటంలేదని నాన్నగారు ఎంత బాధపడు తుంటారో తెలుసా?... పదిరోజులకోసారైనా ఓ వుత్తరం ముక్క రాస్తూండు!"

అప్పుడు—

రాజ్యం అలా అంటున్నప్పుడు. నేను చూడలేదుకానీ, తన కళ్ళల్లో కన్నీటి పొరలు కదిలేవుండాలి... రిక్షా వెళ్ళిపోయింతర్వాత, పైట చెంగుతో కళ్ళు ఒత్తుకుంటూ లోపలకు వచ్చింది.....

ఆ రాత్రి—

మేం ఇద్దరం తిరిగి నిడదవోలు వచ్చేస్తుంటే - రైల్లో అడిగాను రాజ్యాన్ని—

"నీ పెద్దకొడుకు ఉత్తరాలు రాయటంలేదని నీదగ్గర నేను ఎప్పుడైనా బాధపడుతూ చెప్పానా?"

"మీ ప్రశ్నలోనే వుంది జవాబు!.... నాదగ్గర దాచకండి!"— నెమ్మదిగా నా కళ్ళలోకి చూసి చెప్పింది.

నిజమే!....

భర్త కట్టిన మాంగల్యం భార్య గుండెలపై వుండిపోవటం వల్లనేమో— ఒకరి మానసిక స్పందన మరొకరికి అర్థమైపోతుంది.

సారథి ఉత్తరాలు రాయనందుకు నేను మనసులోనే కలతపడిన సందర్భాలు ఎన్నో వున్నప్పటికీ - ఎప్పుడూ రాజ్యం దగ్గర బయట పడలేదు...

రాజ్యంమాత్రం - పోస్ట్‌మాన్ వచ్చేవేళకు వీధిగుమ్మం కాస్తుంది.

సరిగ్గా ఒంటిగంటకు వస్తాడు పోస్ట్‌మాన్.... అప్పటికి నేనో కునుకు తీయటం అయిపోతుంది... కానీ రాజ్యానికి మాత్రం నిద్రపట్టదు

ఒకవేళ ఉత్తరం వస్తుందేమోనన్న ఆశ - నిద్రపోనివ్వదు.... ఒంటిగంటకి మా ఇంటిని పట్టించుకోకుండా - పోస్ట్‌మాన్ ముందుకు వెళ్ళిపోయింతర్వాత - అప్పుడు మంచంమీద నడుం వాలుస్తుంది...

"ఇవాళకూడా ఉత్తరంరాలేదు!" తనలోతాను అనుకున్నట్టుగా నాకు చెబుతుంది!... ఎందుకంటే సారథినించి ఉత్తరంకోసం నేనూ ఎదురు చూస్తూంటానని తనకు తెలుసు కనుక!

"నీ పిచ్చి కాకపోతే సారధి ఉత్తరం రాస్తాడని ఎలా అనుకుంటు న్నావ్?"– అని ఎప్పుడైనా నేను మాట వరసకి అంటే–

"వాడే రాయాలా! - ఇంకెవరి దగ్గర్నించీ రాకూడదా!- అని దబాయిస్తుంది.

నిజానికి ఉత్తరాలు రాసేవాళ్ళు ప్రత్యేకించి ఇంకెవరూ లేరన్న సంగతి తనకూ తెలుసు... రెండోవాడు శ్రీధరం - పక్క ఊళ్ళోనే ఉద్యోగం కావటంవల్ల రోజూ ఇంటిదగ్గర్నించే - సైకిలుమీద ఆఫీసుకి వెళ్ళి వస్తూంటాడు... ఇక మూడోవాడు-గోపాలం!.... మా దగ్గరే వుంటూ ఇంకా కాలేజీ చదువు వెలగబెడుతున్నాడు....

పోతే—

ఉత్తరాలకోసం ఎదురు చూసేలా చేసేది సారధి ఒక్కడే!

చాలాకాలం తర్వాత—

ఇప్పుడు మళ్ళీ సారధినించి ఉత్తరం వచ్చింది...

"ఏం రాశాడండీ!" ఆత్రంగా అడిగింది రాజ్యం.

అంతకంటే ఆతృతగా-అందులోని విషయాలు చదువుతున్నాను.

"పైకి చదవకూడదూ!.... నేనూ వింటాను!"- హెచ్చరించింది రాజ్యం.... నేను చదివి వినిపించాను–

"నాన్నగారికి నమస్కారములు... మీరు అమ్మా కులాసా అని తలుస్తాను... చి॥ బాబిగాడు అల్లరి బాగా చేస్తున్నాడు. కాన్వెంట్‌లో చేర్పించాం!... అన్నట్టు వారం రోజుల క్రితమే స్కూటరుకొన్నాను...

అ స్తమానం దానిమీద ఎక్కించి తిప్పమని బాబిగాడు మారాం చేస్తు న్నాడు... మీ కోడలు క్షేమం... ఇంతేసంగతులు..."

"పోన్లెండి! స్కూటరు మీ జీవితంలో మీరు కొనుక్కోలేక పోయినా - మీ అబ్బాయి కొన్నాడు!'- నవ్వుతూ అంది రాజ్యం.

ఆమాట వినగానే ఆనందమో తెలీదు - ఆరాటమో తెలీదు - మన సంతా కొన్ని క్షణాలు అల్లకల్లోలమైపోయింది.

ఆలజడి చెలరేగిన మనసులో ఎన్నెన్నో జ్ఞాపకాలు....!

మా పెళ్ళికి——

అలకపాన్పు వేసినప్పుడు—

స్కూటరు కావాలని మా మావగార్ని అడిగాను!

దానికి కొంత 'టైం' పడుతుందని చెప్పి - అప్పటికి 'టైం' చూసుకునేందుకు ఓ రిస్టువాచీ కొనిచ్చారాయన.

ఆ తర్వాత ఓసారి పండక్కి వెళ్ళినప్పుడు - రాజ్యంద్వారా స్కూటరు విషయం గుర్తుచేశాను! మావగారికి.

ఆ ఏడు పంటలు దెబ్బతిన్న కారణంగా చేతిలో డబ్బులేదనీ- మరో రెండేళ్ళుపోయాక తప్పక చూద్దామనీ దాటపెట్టేరు.

రెండేళ్ళ తర్వాత - మరోసారి నాచేత అడిగించుకునే అవకాశం ఇవ్వకుండా ఆయనే దాటిపోయారు.... అక్కడితో స్కూటరువిషయం

మరచిపోవాల్సివచ్చింది.... మళ్ళీ దాన్ని జ్ఞాపకం చేసుకోటానికి అవకాశం లేకుండా బరువులూ బాధ్యతలూ పెరిగేయి.... పిల్లలూ పెరిగారు ఉద్యోగంలో నాలుగుమెట్లు పైకెక్కేసరికి సారధి కాలేజీలో చేరాడు....

అప్పట్లో—

స్కూటరు కొనుక్కునేందుకు ఆఫీసులో మూడువేలు అడ్వాన్సు ఇస్తామన్నారు.... నాలో అణగారిపోయిన కోరిక మళ్ళీ విశ్వరూపం దాల్చింది.... బాంకులో అప్పుడూ అప్పుడూ వదీ పరకా చొప్పున దాచిన డబ్బంతా కలిపి రెండువేలదాకా వుంది....

అంతా కలిపితే స్కూటరు వచ్చేస్తుంది!.... అవసరమైతే మరి కొంత అప్పుకూడా చేయచ్చు....

ఆ ఆలోచన రాగానే స్కూటరు అడ్వాన్సుకోసం ఆఫీసులో దరఖాస్తు పెట్టాను. పదిరోజుల్లో డబ్బుచేతికొచ్చింది.

వెంటనే డీలరు దగ్గరకు వెళ్ళాను. ముందుగా రిజిస్ట్రేషన్ చేయించాను.

సరిగ్గా ఆ సమయంలోనే ఇంటర్ పరిక్ష ఫలితాలు వచ్చాయి.... సారధి ఫస్టుక్లాసులో పాసయ్యాడు.. బిఎస్సీకి దరఖాస్తు పెట్టమన్నాను. కానీ వాడేమో ఇంజనీరింగ్ చదువుతానన్నాడు... ఇంజనీరింగ్ చదవటమంటే మాటలతో అయ్యేపనికాదు... ముందు సీటు రావటమే గగనం... సీటు వచ్చింతర్వాత ఫీజులనీ - పుస్తకాలనీ బోలెడంత ఖర్చు...

అమాటే చెప్పేను...

కానీ వాడి పట్టుదల వాడిది... దానికితోడు రాజ్యం వత్తాసుకూడా దొరకటంతో వాడు రెచ్చిపోయాడు... నేను అసహాయుణ్ణయిపోయాను.

ఇంజనీరింగ్ సీటుకోసం ఎన్నో కాలేజీలకు దరఖాస్తులు పంపించాడు. చాలాచోట్ల ఎంట్రెన్స్ పరీక్షలు రాశాడు... కానీ ఎక్కడా సీటు దొరకలేదు.... ఇహ బిఎస్సీలో చేరాలని అనుకుంటూండగా 'రాంచీ'లో సీటుంది రమ్మన్నారు. డొనేషన్ కట్టటానికి అయిదువేలుకూడా తెమ్మన్నారు.

ఆలోచనలో పడ్డాను.

తల్లీ కొడుకులు మళ్ళీ ఏకమయ్యారు... తలవంచక తప్పింది కాదు నాకు. స్కూటరుకోసం డ్రా చేసిన డబ్బంతా ఇచ్చి సారథిని 'రాంచి' పంపించాను.

'దేనికైనాయోగమనేది ఒకటుండాలంటారు... స్కూటరుయోగం నా జాతకంలో లేదు.... అంతే!'— అనుకున్నాను.

ఆమాటే రాజ్యంతో అంటే—

'పోనిద్దురూ! మన పిల్లలు పెద్ద చదువులు చదువుకుని గొప్పవాళ్ళయితే చాలదూ?.... రేపువాడు ఓ ఇంజనీరైతే- మీకు స్కూటరు కొనివ్వలేకపోతాడా?'— అంది నవ్వుతూ.

అంతే!!

స్కూటరు విషయం మళ్ళీ మర్చిపోవాల్సివచ్చింది.... రానురాను కుటుంబంలో ఖర్చులు పెరిగాయి .. వాటితో పోటీపడుతూ, అందిన దానితో రాజీపడుతూ ఉద్యోగ పర్వం పూర్తిచేసేసరికి స్కూటరెక్కి షికార్లు చేసే వయసు దాటిపోయింది....

ఇప్పుడు...

సారదిరాసిన ఉత్తరం చూశాక, మళ్ళీ మనసంతా అందుకే– ఆనందంతోనో ఆరాటంతోనో ఉక్కిరి బిక్కిరై పోయింది।

'ఒకసారి జంషడ్‌పూర్ వెళ్ళొద్దామా?'– అడిగాను రాజ్యాన్ని ఆరాత్రి.

'ఏం?... గాలి అటు మళ్ళిందే?'

'నీ మనవణ్ణి చూద్దువుగాని ఓసారి:'

'డొంక తిరుగుడు దేనికీ? కొడుకు స్కూటరెక్కించుకొని ఊరంతా ఊరేగిస్తే– ఉబలాటం తీర్చుకుందామని అయ్యగారికి ఆశ!'– నవ్వేస్తూ చెప్పింది రాజ్యం.

'పోనీ అలాగే అనుకో... అయినా తప్పా?... వాడి స్కూట రెక్కే హక్కు నాకు లేదా?... నా రక్తంధారపోసి వాణ్ణి చదివించాను ఇవాళవాడు ఇంజనీరుగా వెలగిపోతున్నాడంటే అందుకు కారణం నేను నన్ను స్కూటరెక్కించుకుని తిప్పే బాధ్యత వాడికి మాత్రం ఉండదా?' గర్వంగానే అన్నాను.

'డబ్బులేనివాడు ఓడ ముందెక్కాడట!.... అలావుంది!'– పరిస్థితిని గుర్తుచేసింది రాజ్యం.

నిజమేమరి... వచ్చే పెన్షన్ డబ్బుతో ఎవరిపైనా ఆధారపడ కుండా రోజులు గడుస్తున్నాయి... ఇప్పుడు జంషడ్‌పూర్ వెళ్ళిరావా లంటే కనీసం నాలుగు వందలైనా కావాలి ..

'పోనీ మీరొక్కరూ వెళ్ళిరండి! నేను ఇప్పుడు రావాలంటే కష్టం కూడానూ! అవతల గోపాలానికి వచ్చేనెలలో పరీక్షలు...

శ్రీధరానికి వంటావార్పూ తెలియదాయిరి!... వాళ్ళిద్దర్నీ వదిలి నేను ఎలా రాగలను?...'– నా ఆలోచనల్ని పసిగట్టిన దానిలా సలహా ఇచ్చింది రాజ్యం.

నిజానికి జంషడ్‌పూర్ రావాలని తనకూ మనసులో కోరికవుంది. కానీ ఇల్లాలిగా తన బాధ్యత తనకు తెలుసు... కనీసం నేను వెళ్ళొస్తే నేను పొందే తృప్తిలో- అర్ధాంగిగా తను సగపాలు పంచుకోవచ్చునని ఆశ....!

సారధికోసం కాకపోయినా- మనవడి ముద్దు ముచ్చటపాలు చూడాలన్న కాంక్ష లేకపోయినా– స్కూటరు మోజు తీర్చుకోవాలనే ఆశతో జంషడ్‌పూర్ వెళ్ళటానికే నిశ్చయించుకున్నాను...

ఫలానారోజు బండిలో బయలుదేరి వస్తున్నానని ముందుగా సారధికి ఉత్తరం రాసి బయల్దేరాను. జంషడ్‌పూరులో రైలుదిగేసరికి సారధి ఎదురొచ్చాడు....

స్టేషన్‌లోంచి ఇద్దరం బయటకొచ్చాం...

'ప్రయాణం బాగా జరిగిందా ' అడిగాడు.

'ఉ!'

'అమ్మ కులాసాగా తిరుగుతోందా?'

'ఆఁ!'

వచ్చేనెలలో గోపాలానికి పరీక్షలు కాబోలు!'

'... ...'

'అమ్మను కూడా తీసుకురావల్సింది!–

అలా సారధి ఏమిటేమిటో అడుగుతున్నాడు.... ముక్తసరిగా సమాధానాలు చెప్తూనే ఉత్సాహంతో చుట్టూ చూశాను- వాడు తెచ్చిన స్కూటరుకోసం.

'టాక్సీ!'– అంటూ పిలిచాడు సారధి అంతలోనే.

నా ఉత్సాహం కాస్తా నీరు కారిపోయింది.

'స్కూటరు తీసుకురాకపోయావా ?'– అడిగాను.

'పెట్రోలు అయిపోయింది.... ఇవాళ పోయించాలి!– టాక్సీ ఎక్కుతూ చెప్పాడు...

పదినిమిషాల్లో ఇంటికి చేరుకున్నాం.

లోపలకు అడుగు పెట్టేసరికి హాల్లో గోడవారగా, నీలంరంగులో నిగనిగా మెరిసిపోతున్న స్కూటరు కనిపించింది... నాకెంతో ఇష్టమైన రంగు.

'స్కూటరు కలర్ చాలా బాగుంది'– తృప్తిగా చూస్తూ చెప్పాను అంతలోనే 'డాడీ' బాబిగాడు గదిలోంచి వచ్చాడు.

'కమాన్! ఈయనెవరో తెలుసా? తాతయ్యగారు!... గుడ్ మాణింగ్ చెప్పు!'– వాణ్ణి ఎత్తుకుని నాదగ్గరకు తీసుకొచ్చాడు సారధి.

'మీ అబ్బాయిగారి ప్రతిభాపాటవాలగురించి తీరుబడిగా చెబుదురు గాని!.... ముందు మావయ్యగార్ని లోపలకు రానివ్వండి!'– కాఫీ గ్లాసుతో వచ్చింది కోడలు.

మళ్ళీ ఉభయకుశలోపరి...

ఆరోజంతా ప్రయాణపు బడలికతోనే గడిచిపోయింది. మర్నాడు పొద్దున్న స్కూటరు మీద బాబిగాణ్ణి ఎక్కించుకుని కాన్వెంటుకి తీసుకెళ్ళి దిగబెట్టి వచ్చాడు సారధి....

మూడోరోజున ఆఫీసునించి వచ్చింతర్వాత, నన్ను స్కూటరు మీద తీసుకెళ్ళి ఊరుచూపిస్తాడేమోనని ఆశగా ఎదురుచూశాను....

'ఊరు పెద్దదేకానీ- ఇక్కడ చూసేందుకు ఏమీలేవు నాన్నా!... ఈటౌను షిప్‌కీ ఊరుకీ చాలాదూరం!.... సినీమాలకు వెళ్ళాలన్నా కష్టమే!... అందుకని వారానికోసారి మేమే- ఓ ఫిలిం తెప్పించుకుని- ఇక్కడి క్లబ్బుహాల్లో చూస్తాం!'– ఆరాత్రి భోజనాలు చేస్తూంటే– మాటల సందర్భంలో చెప్పాడు సారధి.

నాలుగో రోజున వాడు ఆఫీసుకి వెడుతూంటే, నేనే చెప్పాలని అనుకున్నాను- 'ఇవాళ సాయంత్రం తొందరగావస్తే అలా వూళ్ళోకి పోయొద్దాం!'- అని. ఈలోగా సారథే అన్నాడు–

'ఇవాళ సాయంత్రం మా క్లబ్ హాల్లో బాలమురళీ కచేరీ ఏర్పాటు చేశాం. రెడీగా వుండండి.... వెడదాం!'

నాకు ప్రాణం లేచివచ్చినట్టనిపించింది.

క్లబ్బుకి ఎలాగూ స్కూటరు మీద తీసుకెడతాడు.... పైగా బాలమురళీకృష్ణ కచేరీని రేడియోలో వినటమేకానీ నేనెప్పుడూ చూడలేదు... ఇప్పుడు స్కూటరు ఎక్కాలనే చిరకాల వాంఛతోపాటు, ఆయన కచేరిని చూసే అవకాశం కూడా కలిసొచ్చింది....

సాయంత్రం అయిదయ్యేసరికి 'రెడీ' అయి కూర్చున్నాను.

మరో అరగంటకి- సారథి ఆఫీసునించి వచ్చాడు... కానీ స్కూటరు మీద రాలేదు. ఎవరిదో కారు తీసుకొచ్చాడు.

'స్కూటరేమైందిరా?' అడిగాను. నిరుత్సాహాన్ని గుండెల్లోనే దాచేసుకుని.

స్కూటరు మా ఫ్రెండుకిచ్చి అతనికారు తెచ్చాను... మనం అందరం వెళ్ళాలంటే కారు కావాలి కదా మరి!'

నిజమే.... ఆ ఆలోచనే రాలేదు నాకు...

అదే నిరుత్సాహంతో మరోరెండు రోజులు గడిచిపోయాయి.... ఆరోజు మధ్యాన్నం పేపరు చూస్తుంటే. బాబిగాడు నాదగ్గరకొచ్చాడు వాడిచేతిలో ఏదో బొమ్మల పుస్తకం వుంది....

'తాతగారూ! ఇందులో స్కూటరు బొమ్మవుంది!'— అంటూ ఆబొమ్మను నాకు చూపించాడు.

'డాడీ స్కూటరులాగే వుందికదూ ఇది?'— నేను ఆ బొమ్మ చూస్తూంటే- వాడు నన్ను చూస్తూ అడిగాడు.

'అవును!'

'డాడీ స్కూటరుమీద స్కూలుకి నన్ను ఎంత స్పీడుగా తీసుకెడతాడో తెలుసా!.... కొంచెం పెద్దయ్యాక నేనూ స్కూటరు నేర్చుకుంటాను తాతగారూ!.... డాడీలాగే స్పీడుగా తొక్కుతాను'!

'నన్ను కూడా స్కూటరు ఎక్కించుకుని స్పీడుగా తొక్కమని– ఇవాళ మీడాడీని అడుగుతాను !'– చెప్పాను గర్వంగా.

'నిన్ను ఎక్కించుకోడుగా ?'

ఆమాట వినగానే తెల్లబోయాను.

'ఏం ?.... ఎందుకనీ ?'

'నువ్ ముసలాడివికదూ !.... అందుకని ;.... కొత్త స్కూటరు మీద ముసలాళ్ళు ఎక్కకూడదు.... మమ్మీ, నేనూ అందంగా వుంటాం కదా... అందుకని మేమే ఎక్కాలట !'

'ఎవరు చెప్పారు ?'– వాణ్ణి దగ్గరకు తీసుకుంటూ అడిగాను.

'డాడీ'....

కోరిక నిండిన గుండెలపై కమ్చీతో చెళ్ళున కొట్టినట్టయింది.
అంటే ?

అంటే నేను కేవలం ముసలాణ్ణేతప్ప- సారధికినేనేమీకానా ?...
అంతే ; !

తమకాళ్ళమీద తాము నిలబడేవరకే పిల్లలకి తల్లీ తండ్రీకావాలి. గూటిలో పక్షి పిల్లలు రెక్కలు వచ్చేవరకే ఒదిగి మదిగి వుంటాయి- ఏక్షణానొన్న రెక్కల్లోకి సత్తువవచ్చినప్పుడు- కనీసం తల్లి పక్షికూ్కడా తెలియకుండా అనంతాకాశంలోకి ఎగిరిపోతాయి. మళ్ళీ ఆనవాలు పట్టేందుకయినా అవి కనిపించవు.

ఎదిగిన పిల్లలు కూడా రెక్కలొచ్చిన పక్షులే.... వయసుతోబాటు వాళ్ళ భావాలు కూడా మారిపోతాయి. తమ భార్యాపిల్లలూ, తమ ఇల్లు, తమ సంపద- ఇవన్నీ తమ జీవన విధానంతో పెనవేసుకుంటున్న కొద్దీ తల్లిదండ్రులతో పెంచుకున్న ఆత్మీయతా, ప్రేమానుబంధాలూ బలహీన పడిపోతాయి.... అప్పుడు కన్నవారిపట్ల పిల్లలకు మిగిలేది బాధ్యత కావచ్చు... కానీ భావోద్రేకం మాత్రం కాదు...

స్కూటరెకాల్కనే వాంఛ మరోసారి- చివరిసారి- అందుకే నాలో అణగారిపోయింది....

ఆమర్నాడే బయల్దేరి అక్కడినించి వచ్చేశాను....

ఇంటికొచ్చి రాగానే నిలవనీయకుండా విశేషాలు అడిగి- ఉక్కిరి బిక్కిరి చేసింది రాజ్యం.

'ఇంతకీ స్కూటరు మోజు తీరిందా అయ్యగారికి?'— అడిగింది ఆతర్వాత.

'ఆహా!... తీరిపోయింది... ఉన్నవారం రోజులూ స్కూట రెక్కించుకుని- కడుపుతీరా తిప్పాడు నీకొడుకు!.... ఇహ ఈజన్మకి ఆసరదా ఉండదులే!'— అన్నాను తెచ్చిపెట్టుకున్న నవ్వుతో!!...

ఆంధ్రప్రభ-